క్లుప్తంగా

ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

లబ్బీపేట(విజయవాడతూర్పు):ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలోని 24వ డివిజన్‌లోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులందరికీ అందేలా చూడటంతో పాటు, వారి సమస్యలు తెలుసుకుని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వచ్చేలా గృహసారథులు పనిచేయాలని సూచించారు. వార్డు సచివాలయాల్లో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం ప్రజలతో మమేకమవుతా సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. కార్పొరేటర్ కుక్కల అనితతో పాటు, డివిజన్‌లోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న మహిళ అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసు స్టేషన్ పరిధి శాంతినగర్లో ఓ మహిళ గంజాయి అమ్ముతుండగా పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. సీఐ కె.శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు తుపాకుల రామకృష్ణ పార్కు వద్ద కుందురు జయమ్మ , చింతమాల రాజా అనే వ్యక్తికి గంజాయి అమ్ముతుండగా గత నెల 28వ తేదీ రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చి కిలో గంజాయి స్వాధీనం చేసుకొన్నారు. చింతమాల రాజా నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిద్దరి పై కేసు నమోదు చేశారు.

అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం అయ్యప్పస్వామివారి మందిరంలో బుధవారం మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన స్వామివారికి విశేషంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను గురుస్వామి బల్లెం పూర్ణయ్యస్వామి పర్యవేక్షించారు.

నగరంలో సోనీ సర్వీస్ సెంటర్ ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు):కస్టమర్లకు అత్యుత్తమ సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఈ మేరకు తమ నెట్‌వర్క్‌ను దేశమంతా విస్తరిస్తున్నామని సోనీ కస్టమర్ సర్వీస్ నేషనల్ హెడ్ విశాల్ మాథూర్ అన్నారు. బుధవారం పటమట టీచర్స్ కాలనీలోని ఫన్‌టైమ్స్ క్లబ్ రోడ్డులో సోనీ ఆల్ఫా ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలోని తమ సర్వీస్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేసి వినియోగదారులకు అవసరమైన కెమెరా బాడీ, లెన్సులకు అత్యుత్తమ కస్టమర్ సర్వీస్‌ను అందించటమే ఆల్ఫా కెమెరా బాడీ రిపేర్ సెంటర్ లక్ష్యమన్నారు. ఆల్ఫా సర్వీస్ సెంటర్లు దేశంలోని ఢిల్లీ, ఘజియాబాద్, జైపూర్, లూథియానా, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూర్, కొచ్చి, త్రివేండ్రం, కొజికోడ్, హైదరాబాద్, విజయవాడ, ముంబై, అహ్మదాబాద్, పుణె, నాగ్‌పూర్, ఇండోర్, కోల్‌కతా, గువాహటి, భువనేశ్వర్ నగరాల్లో విస్తరించిందని పేర్కొన్నారు. ఆయా నగరాల్లో లెన్స్ రిపెయిర్ల కోసం 8 సర్వీస్ సెంటర్లను, ఆల్ఫా కెమెరా బాడీ రిపేర్ కోసం 20 నగరాల్లో 23 సర్వీస్ సెంటర్లను, సిసిడి ఇమేజర్ క్లీనింగ్, ఫర్మ్‌వేర్ అప్‌డేట్లు లాంటి బేసిక్ సర్వీసులని అందించగల 40కిపైగా సర్వీస్ సెంటర్లు, 220పైగా కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. సోనీ ఇండియా ' డిజిటల్ ఇమేజింగ్ బిజినెస్ హెడ్ ముఖేష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ లోకల్ మార్కెట్లలో పార్టనర్స్‌ను సపోర్ట్ చేసి సహాయం చేయడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని అవుట్‌లెట్లలోనూ మెరుగైన, వేగవంతమైన టర్నెరౌండ్ సాధించడంతో పాటు కస్టమర్లు సంతృప్తిని అందిస్తున్నామన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్‌ను నిషేధించిన నేపథ్యంలో వాటి తయారీ, విక్రయ, వినియోగదారులుకు శిక్షణ తరగతులు నిర్వహించారు. నగరంలోని ఐవీ ప్యాలెస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వీఎంసీ చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పి. రత్నావళి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్‌లో విజయవాడకు మెరుగైన ర్యాంకు సాధించేలా వీఎంసీ ప్రణాళికలు అమలు చేస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామని చెప్పారు. నగరవాసులు కూడా 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న వాటిని స్వచ్ఛందంగా నిషేధించి వీఎంసీ అధికారులకు సహకరించాలని కోరారు. ఏఎంవోహెచ్ డాక్టర్ సురేష్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్‌లు ఓబేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూబీకి అదనపు హంగులు

- రూ.6.32 లక్షల వ్యయ అంచనాతో రోడ్డు నిర్మాణం
- రూ.5 లక్షలతో వాల్ పెయింటింగ్స్



చక్కని పువ్వుల బొమ్మలతో ఆర్‌యూబీ గోడలు



ముస్తాబైన ఆర్‌యూబీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చినుకు పడితే చాలు ముంపుబారిన పడేది సింగ్‌నగర్ ఆర్‌యూబీ(రైల్వే అండర్ బ్రిడ్జి). ఇటు ప్రయాణించాలంటే ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొనేవారు. ఇదంతా గతం.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌యూబీపై దృష్టి పెట్టింది. ఇప్పుడు ఈ అండర్ బ్రిడ్జి అదనపు హంగులతో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది.

ట్రాఫిక్ సమస్యలకు చెక్..

సింగ్‌నగర్ ఫ్లై ఓవర్, ఆర్‌యూబీ నుంచి నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. గతంలో ఫ్లైఓవర్ మాత్రమే ఉండేది. ఆ దారిలో కాస్త ట్రాఫిక్ నిలిచినా ఫ్లై ఓవర్ పైనుంచి అటు సింగ్‌నగర్ అమెరికన్ హాస్పటల్ వరకూ, ఇటు బుడమేరు, గవర్నమెంట్ ప్రెస్ వరకూ గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోయేవి. ద్విచక్ర వాహనచోదకులు, ఆటో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సింగ్‌నగర్, పాయకాపురం, రాధానగర్, రాజీవ్‌నగర్, కండ్రిక, పాతపాడు, నున్న, నూజివీడు ప్రాంతవాసులు నగరంలోకి వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. ఇక్కడ సమస్యను గుర్తించిన ప్రజాప్రతినిధి మల్లాది విష్ణు గతంలో తాను ఎమ్మెల్యే ఉన్న సమయంలో ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెట్టేలా ప్రణాళిక చేశారు. సెంట్రల్ రైల్వే, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి ఆర్‌యూబీ నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చారు. ఆర్‌యూబీ పూర్తయిన తర్వాత దాని నిర్వహణపై గత టీడీపీ పాలకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కొద్దిపాటి చినుకులు పడినా వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోలకు తీవ్ర అంతరాయం కలిగేది. ప్రయాణికుల అవస్థలు గుర్తించిన ఎమ్మెల్యే విష్ణు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

రూ.11 లక్షల అంచనాతో సుందరీకరణ

ఆర్‌యూబీ దారిలో ధ్వంసమైన రోడ్లను వేసేందుకు రూ.6.32 లక్షలు, అండర్ బ్రిడ్జి సుందరీకరణకు రూ.5 లక్షల వ్యయ అంచనాతో వాల్‌పెయింటింగ్స్ పనులకు శ్రీకారం చుట్టింది. ఇవన్నీ పూర్తికావడంతో ఇటీవల ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ తదితరులు పునః ప్రారంభించారు.

తగ్గిన ట్రాఫిక్ సమస్య

ఆర్‌యూబీ నిర్మాణం తర్వాత ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ సమస్య చాలా వరకూ తగ్గింది. కొత్తగా రోడ్డు వేయడం, ఆర్‌యూబీకి రెండు వైపులా గోడలపై రంగులు అద్దడంతో ఈ మార్గం ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ప్రయాణికుల సమస్యలను పరిష్కరించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌యూబీని తీర్చిదిద్దారు



ఆర్‌యూబీ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గాయి. ఫ్లైఓవర్‌పై ఏ ఒక్క వాహనం నిలిచిపోయినా తరచూ ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు ఆర్‌యూబీని రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దారు.

–ఎస్‌కే బాబు, సింగ్‌నగర్

ఇప్పుడు సౌకర్యంగా ఉంది



ఆర్‌యూబీతో రామకృష్ణాపురం నుంచి అజిత్‌సింగ్‌నగర్ వైపు వెళ్లడానికి సౌకర్యంగా ఉంది. ముఖ్యంగా మహిళలు ఫ్లై ఓవర్ మీద నుంచి వెళ్యాల్సిన అవసరం లేకుండా ఇటు వైపు రాకపోకలు సాగిస్తున్నారు.

–పి.చంద్రమౌళి.రామకృష్ణాపురం

శరవేగంగా యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు



పొక్లెయిన్‌తో యూజీడీ పైపులైన్ అనుసంధానం పనులు చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్):30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో యూజీడీ పంపింగ్ స్టేషన్ పైపులైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బుధవారం పంపింగ్‌స్టేషన్‌కు పైపులైన్‌లను అనుసంధానం చేసే పనులు ప్రారంభించారు. పొక్లెయిన్‌తో ప్రధాన పైపులను కలుపుతున్నారు. అయితే ఇక్కడ పైపులైన్ పనులలో భాగంగా విద్యుత్ స్తంభాలు అడ్డంకిగా మారటంతో కొంత మేర ఇబ్బందులు కలుగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉండటంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేస్తున్నామని సిబ్బంది చెబుతున్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది సహకరిస్తే పనులు మరింత వేగవంతం చేసి వేసవి నాటికి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని చెబుతున్నారు.

రహదారులకు అత్యంత ప్రాధాన్యం

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- రూ.1.71 కోట్లతో నిర్మించిన రహదారులు ప్రారంభం



డాక్టర్స్ కాలనీలో రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్ డాక్టర్స్ కాలనీలో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన 11 అంతర్గత రహదారులను కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నాడు-నేడు ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని డివిజన్లకు సమానంగా నిధులు కేటాయిస్తూ, మునుపెన్నడూ లేని విధంగా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డాక్టర్స్ కాలనీలో పనులు ప్రారంభించుకుని నిర్ణీత గడువులోగా ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందన్నారు. డీఈ గురునాథం, 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ, నాయకులు పసుపులేటి యేసు, సిహెచ్ రవి, మోదుగుల గణేష్, టిక్కం కృష్ణ, తిరుపతిరావు, నాగేశ్వరరావు, ఉద్దంటి శ్రీను, నాగు, కె.రవి, వీఎంసీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్):గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురయిన ప్రాంతాలను అభివృద్ధి చేయటంతో పాటు మూడున్నరేళ్ళ కాలంలో నియోజకవర్గంలో 90 శాతం రహదారుల నిర్మాణ పనులు చేపట్టినట్లు ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 31 వ డివిజన్ పార్కు రోడ్డులో రూ. 31.13 లక్షలతో నిర్మించిన నూతన రహదారులతో పాటు.. మధురానగర్ ఆర్.యు.బి.కి ఇరువైపులా రూ. 20 లక్షలతో నిర్మించిన సర్వీస్ రోడ్లను స్థానిక కార్పొరేటర్లు పెనుమత్స శిరీష సత్యం, కొంగితల లక్ష్మీపతిలతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అందినకాడికి దోచుకోవటమే ధ్యేయంగా పనిచేశారని విమర్శించారు. నగరాభివృద్ధికి కేటాయించిన నిధులను సైతం దారి మళ్లించారని ఆరోపించారు. టీడీపీ హయాంలో నియోజకవర్గానికి చేసింది శూన్యం అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులను సక్రమంగా వినియోగించి.. ప్రజలకు అన్నీ రకాల మౌలిక సదుపాయాలను కలిస్తున్నట్లు వెల్లడించారు. నిత్యం వేలాది మంది సంచరించే పార్కు రోడ్డును గత ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే రూ. 31.13 లక్షల నిధులతో ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశామని తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్ట్యా రాకపోకలకు అనువుగా ఇరువైపులా రహదారిని పునరుద్ధరించినట్లు వెల్లడించారు. మరోవైపు మధురానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్.యు.బి.)ని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 18 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. 45 శాతం పనులు ఇప్పటికే పూర్తికాగా.. వేసవి ముగిసేనాటికి ఆర్.యు.బి.ని అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణవేణి, పట్టాభి రామరాజు, బెజ్జం రవి, మానం వెంకటేశ్వరరావు, కనపర్తి కొండా, ఎస్.కె.బాబు, అక్బర్, కొండలరావు, గోవింద్, దేవినేని శివాజీ, అంగిరేకుల విజయ్, నగర పాలక సంస్థ సిబ్బంది, స్థానికులు, పాల్గొన్నారు

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సామాన్య, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. బుధవారం 64వ డివిజన్ 284వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజాశక్తి నగర్లో 256 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ఓ అద్భుతమైన కార్యక్రమమని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగంతో ప్రజల ఇంటి వద్దకే వచ్చామని, సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలు వివరించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటి వద్ద పుస్తకం ఏర్పాటు చేసి, అందులో శానిటేషన్, మలేరియా సిబ్బంది రోజూ హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. అలాగే పేదలందరికీ ఇళ్ల పథకం తొలిదశ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు స్టేటస్ ను తెలియపరచాలని పీఓ యూసీడీ విభాగానికి సూచించారు. కోఆప్షన్ నందెపు జగదీష్, పీఓ యూసీడి కె.శకుంతల,సీడీఓ జగదీశ్వరీ,వైసిపి డివిజన్ కోఆర్డినేటర్ ఎస్‌కె ఇస్మాయిల్,అధ్యక్షులు జిల్లెల శివ, నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, అక్కిశెట్టి నారాయణ, పందిరివాసు, మేడా రమేష్, చెక్కా నరసింహారావు, గురాల యేసుబాబు, మీసాల రామకృష్ణ, అగురు త్రినాథ్, వెంకటేశ్వరమ్మ, నాగమణి తదితరులున్నారు.

సుబ్బరామిరెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి

డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



సుబ్బరామిరెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న డాక్టర్ గౌతంరెడ్డి, విష్ణువర్ధన్ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):విలువలతో కూడిన విద్యను అందించి ఎంతోమందిని మేధావులుగా తీర్చిదిద్దిన ప్రముఖ ఉపాధ్యాయులు పూనూరు సుబ్బరామిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పిలుపు నిచ్చారు. భానునగర్ జంక్షన్‌లో బుధవారం ప్రముఖ ఉపాధ్యాయులు, గౌతంరెడ్డి తండ్రి పూనూరు సుబ్బరామిరెడ్డి 13వ వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా గౌతంరెడ్డి హాజరై విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌తో కలిసి సుబ్బరామిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. తనతో పాటు ఎంతోమందిని ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దిన సుబ్బరామిరెడ్డికి తనయుడిని కావటం తనకు గర్వంగా ఉందన్నారు. విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ మాట్లాడుతూ విలువలతో కూడిన క్రమశిక్షణను అలవాటు చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. వారు నేర్పిన బాటలోనే ఎంతోమంది విద్యార్థులు అత్యున్నతంగా తయారయ్యారని చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు అనేక రంగాల్లో ఉంటూ సమాజానికి సేవ చేస్తున్నారన్నారు. సుబ్బరామిరెడ్డి తనయులు జయరామిరెడ్డి, నిర్మల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు గాంధీ, విజయ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మిలి రత్నకుమార్, బల్లం కిషోర్, గుడ్డేటి అనీల్, సామంతపూడి చిన్నా, వర్మ,శంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లతో అవ్వాతాతల మోముల్లో ఆనందం



ప్రజాశక్తి నగర్లో జగనన్న జిందాబాద్ అంటున్న వృద్ధురాలు, పక్కన ఎమ్మెల్యే మల్లాది విష్ణు



26వ డివిజన్‌లో వేకువజామున పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పాయకాపురం(విజయవాడరూరల్): దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున పింఛన్ల పంపిణీ చేస్తున్నామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్లో కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మతో కలిసి ఇంటింటికి కెళ్లి ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ సామాజిక భద్రత పింఛన్లు అందించడంలో దేశంలో ఏ రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశ్‌కు దీటుగా లేదన్నారు. చంద్రబాబు పాలనలో ఎన్నికల ముందు వరకు కేవలం రూ.వెయ్యి మాత్రమే పింఛన ఇచ్చే వారని గుర్తుచేశారు. కానీ నేడు ఒక్కొక్కరికి రూ.2,750 చొప్పున అందిస్తుండటంతో అవ్వాతాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో కేవలం 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇచ్చిందని, కానీ ఈ ప్రభుత్వంలో 63.66 లక్షల మందికి అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం నెలకు రూ.1,754 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోందని వివరించారు. ఒక్క సెంట్రల్ నియోజకవర్గంలోనే 26,418 మందికి ప్రతి నెలా రూ. 7కోట్ల 18లక్షల 24వేల 500 పింఛన్ రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ హయాంలో పది రోజులు పడిగాపులు కాస్తే తప్ప పింఛన్ డబ్బులు చేతికి అందేవి కాదని, కానీ ఈ ప్రభుత్వంలో లబ్ధిదారులు ఉన్న చోటుకే పింఛన్ అందించే విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. పీవో యూసీడీ కె.శకుంతల, పీడీఓ జగదీశ్వరి, పార్టీ డివిజన్ కోఆర్డినేటర్ ఎస్‌కె. ఇస్మాయిల్, అధ్యక్షుడు జిల్లెల శివ, నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, అక్కిశెట్టి నారాయణ, పందిరివాసు, మేడా రమేష్, చెక్కా నరసింహారావు, గురాల యేసుబాబు, మీసాల రామకృష్ణ, అగురు త్రినాథ్, వెంకటేశ్వరమ్మ, నాగమణి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఫించన్లు పంపిణీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫించన్లు అందిస్తున్నామని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. ఆమె బుధవారం సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురు వృద్ధులు, వికలాంగులకు ఫించన్లు అందచేశారు.

ఠంఛన్‌గా పింఛన్

మధురానగర్(విజయవాడసెంట్రల్):అవ్వాతాతలు, దివ్యాంగులకు ఠంఛన్‌గా తెల్లవారుజామునే వలంటీర్‌లు తలుపుతట్టి పింఛన్‌లు అందజేశారు. 26వ డివిజన్ చుట్టుగుంట, 27వ డివిజన్ దుర్గాపురంలో మంచం మీద ఉన్న లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు.

డివిజన్లలో పింఛన్ల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 61వ డివిజన్లో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. 360 చొప్పున మొత్తం 1325 మంది లబ్ధిదారులకు అందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్, అనిల్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

62వ డివిజన్లో కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి 1450 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్, రామిరెడ్డి, వీరబాబు, హైమావతి, వెంకట్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్):అర్హతే ప్రామాణికంగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పూర్తి పారదర్శకంగా పింఛన్‌లు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్‌లో వలంటీర్‌లతో కలిసి ఆమె పంపిణీ చేశారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):వైఎస్సార్ పింఛను కానుకతో రాష్ట్రంలోని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల జీవితాల్లో ప్రతి నెలా మిక్కిలి ఆనందం కలుగుతుందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో 'వైఎస్సార్ పెన్షన్ కానుక'లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. రాష్ట్రంలోని వృద్ధులకు పెద్ద కొడుకులా, దివ్యాంగులు, వితంతువులకు పెద్ద అన్నయ్యలా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, అమిత్ తదితరులు పాల్గొన్నారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో వైఎస్సార్ పింఛను కానుకలను కార్పొరేటర్ ఇసరపు దేవీ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం



నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించిన గురుమూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆయుర్వేద దినచర్యను పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలని రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ గురుమూర్తి అన్నారు. బందరు లాకుల వద్ద గల నోరి రామ శాస్త్రి ఆయుర్వేద కళాశాల డైమండ్ జూబ్లీ హాల్లో విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ విభాగ్ ఆధ్వర్యంలో విశ్వ మంగళ దివస్ బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వ ఆయుర్వేద పరిషత్ నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం అభివృద్ధికి సమయం ఆసన్నమైందన్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులు మరింతగా కృషి చేసి ఆయుర్వేదాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. విశ్వమంతా ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో విశ్వ మంగళ దివస్ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ గురుమూర్తిని సత్కరించారు. ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ సాయి సుధాకర్, ఆర్‌డీడీ వెంకట కృష్ణ, సూపరింటెండెంట్ రాజరాజేశ్వరి, విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ అధ్యక్షురాలు డాక్టర్ పూర్ణ రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లు ధరణికుమార్, వైద్య విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.ప్రతిమ

విజయవాడ స్పోర్ట్స్:రాష్ట్ర స్థాయి అండర్-9 చెస్ పోటీలకు కానూరులోని స్కాట్స్‌పైన్ స్కూల్ విద్యార్థులు యు.రిత్విక్, యు.దివ్యాన్ష్, తేజవజ్రాక్ ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా పోటీల్లో ముగ్గురు క్రీడాకారులు అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. అనంతరం జరిగిన జిల్లా జట్ల ఎంపిక పోటీల్లోనూ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారు. త్వరలో గుడివాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారులను, కోచ్ జి.రామకృష్ణను స్కాట్స్‌పైన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రతిమ అభినందించారు. ఈ ముగ్గురు క్రీడాకారులు గత కొన్నేళ్లుగా విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ చెస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని కోరారు.

పొంగలి షెడ్డులో ఇబ్బందులు లేకుండా చూడాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):పొంగలి నైవేద్యం వండే షెడ్డులో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఘాట్‌రోడ్డు ఓం టర్నింగ్‌లోని పొంగలి షెడ్డును చైర్మన్, పాలక మండలి సభ్యులు బుధవారం పరిశీలించారు. పొంగలి నైవేద్యం వడ్డేందుకు దేవస్థానం 20 గ్యాస్ పొయ్యిలను సిద్ధం చేయడంతో వాటిని వెలిగించారు. పొంగలి షెడ్డు లోపల భాగంలో పెయింట్ వేసి అందంగా తీర్చిదిద్దడంతో పాటు లోపల వేడి బయటకు వెళ్లేలా ఎడ్జస్ట్ ఫ్యాన్‌లను ఏర్పాటు చేయాలని, షెడ్డు లోపల మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని సూచించారు. షెడ్డుకు అవసరమైన మరమ్మతులు చేపట్టి వీలైనంత త్వరగా పొంగలి షెడ్డును ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. పాలక మండలి సభ్యులు బచ్చు మాధవీకృష్ణ, బుద్దా రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.